# నాకు నచ్చిన కథ

అబ్బూరి ఛాయాదేవి

కల్యాణ సుందరీజగన్నాథ్ రచన: "చిఱుచెమటలు, చందనం".

సంప్రదాయాలకు బానిసలైన స్త్రీల కథలనూ, బలి అయిపోయిన స్త్రీల కథలనూకరుణార్ద్రపూరితంగా, సాహితీఖండాలుగా సృష్టించి మేధావుల మన్ననలందుకున్న రచయిత్రి శ్రీమతి కల్యాణ సుందరీ జగన్నాథ్. స్త్రీవాదం ప్రాచుర్యం పొందని రోజుల్లో, పురుషాధిక్య సమాజంలో స్త్రీల నిస్సహాయ పరిస్థితుల పట్ల సానుభూతితో, అవగాహనతో రాసిన కథలామెవి. ఆమె ఎంచుకున్న కథా వస్తువులు సాంఘికమైన వైనా, కథనం జానపద గాథల్ని తలపింపచేస్తుంది. కథల్లో మధ్యమధ్య జానపద గేయాలను సమయానుకూలంగా వాడటం ఆమె శైలిలో ఒక విశేషం. "పచ్చని చేలతో, పల్లెపడుచుల నవ్వులతో, లేగల పరుగులతో అలరారు తెనుగు నాటి పల్లెసీమల" నేపథ్యంతో, తను విన్న, తనుకన్న కథలకూ, వ్యథలకూ సాహితీరూపాన్నిచ్చారు కల్యాణ సుందరిగారు.

ప్రసిద్ధ ఆంధ్ర చరిత్రకారులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు ఆమె చేత "తొలుతగా కలము పట్టించి, కథను వ్రాయించి భారతిలో ప్రచురించి, "ఆమెకు ఆత్మవిశ్వాసము" కలుగచేసినట్లు కృతజ్ఞతా పూర్వకంగా చెప్పుకున్నారామె. ఆరు కథలతోకూడిన ఆమె ప్రథమ కథా సంపుటానికి (1966), విశిష్ట కథారచయిత శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు పరిచయ వాక్యాలు రాశారు - "యిన్ని కథలూ..... అంతఃకరణ ఉన్న ఒక ఆడకూతురు చెప్పినవి. 'రచించినవి' కావు. అంతమాట ఎందుకనలేదంటే, 'రచన' అనేటప్పటికి - అసహజానికి సహజత్వకల్పనకు యత్నించే చాకచక్యం....యీ కథలలో, మాట కట్టూ, ఆ ఒద్దికా, ఆ ముక్తసరితనం, ఆడకూతురవటం,,చేతనేనీ కథలు చదివాను. చదివించుకొని విన్నాను. చదివేవారు తల ఊచగా, వెరసిగా ఆనందించాము." అని ప్రశంసించారు.

కథ 'చెప్పడమే' మన తొలి 'సంప్రదాయం'. తెలుగులో ఆధునిక కథా రచన పాశ్చాత్య ప్రభావంతో కొత్త శైలినీ, శిల్పాన్నీ సంతరించుకుంది. అటువంటి మెళకువలతో, సరళంగా కథ 'చెప్పే' పద్ధతితోపాటు, సాహితీ సుగంధాన్ని వెదజల్లే 'రచనా' శైలిని కూడా మేళవించి, మల్లాది వారి శైలిని కొంత పుణికి పుచ్చుకున్నట్లుగా, తన కథనంతో పాఠకులపై ప్రగాఢముద్రని వేస్తారు కల్యాణ సుందరీ జగన్నాథ్‌గారు.

ఈమె "ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత సాహిత్యాలతో మంచి పరిచయం తోపాటు, విశిష్టమైన అభిరుచి, భావుకత, జీవన పరిశీలనా దృష్టి కల రచయిత్రి"గా పేరు పొందారు. ఈమె కథల్లో ఎక్కువ ప్రసిద్ధి పొందిన కథలూ, మరపురాని కథలూ-- "అలరాసపుట్టిళ్ళు" ', "మాదంతమబ్బు"---భర్తతో కాపురం చేయడం భార్యకి ఇష్టంలేక అత్తిల్లు విడిచివచ్చినా, భర్తకి భార్య పై ఏ మాత్రం అనుమానం వచ్చినా, అటువంటి భార్యల భవిష్యత్తు శూన్యమవుతుంది మన సాంప్రదాయిక సమాజంలో, అట్టి నిస్సహాయ పరిస్థితులను హృదయాన్ని కదిలించేటట్లుగా చిత్రించారు ఈ కథల్లో.

మన సమాజంలో కులాలూ, మతాలూ, అంతస్తులూ, ఎన్నో అడ్డొస్తాయి ప్రేమించుకుని పెళ్ళి చేసుకోవాలనుకునే యువతీ యువకులకు --విద్యావంతులైనా, అవిద్యావంతులైనా, పట్నవాసం వాళ్ళైనా, పల్లెటూరి వాళ్ళైనా అవే ఆటంకాలు, అవే భగ్న హృదయాలు. కుటుంబాల్లోని పెద్దలకు ఇటువంటి ప్రేమల పట్ల సానుభూతి ఉండదు. వాళ్ల పరువు ప్రతిష్ఠలూ, పట్టుదలలే ముఖ్యం వారికి. విధికూడా అనుకూలించదు ప్రేమ జంటలకు సాధారణంగా. ఇది అనాది నుంచీ వస్తున్న కథ. అంతేలేని కథ. "చిఱుచెమటలు, చందనం" ఈ కోవకు చెందిన కథే. ఇది నాకు నచ్చిన ఒక మంచి కథానిక - కల్యాణ సుందరీ జగన్నాథ్ గారు రాసిన వాటిలో.

కథ మామూలు కథే అయినా, ఈ రచయిత్రి ప్రత్యేక రచనాశైలికీ, కథానికా శిల్పానికీ ఇదొక మంచి ఉదాహరణ. కథాశీర్షికే రచయిత్రి శైలికి ప్రతీక. ఈ కథానిక మొదట ఏ పత్రికలో ఎప్పుడు అచ్చయిందో తెలియలేదు. ఆమె సంపుటాలలోని కథలకు వేటికీ ప్రచురణ వివరాలు ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే పరిశోధకులకు ఉపయోగపడేవి.

పల్లెటూరి పిల్ల అలివేలు. చిన్నప్పటినుంచీ తనతో కలిసి మెలిసి తిరిగిన సత్యం అనే అతన్ని ప్రేమించింది. అతనికీ అలివేలంటే ఇష్టం. అలివేలు తండ్రికి 'డబ్బేదేవుడు'. తనకు పిల్లనిమ్మని బ్రతిమాలడం సత్యానికిష్టంలేదు.తీరా అడిగాక అలివేలు తండ్రి కాదూ కూడదంటాడేమోనన్న పౌరుషం. అలివేలుకి దూరపు వేలు విడిచిన మేనరికం, డబ్బున్నవాళ్ల సంబంధం నిశ్చయించారు.

"అలివేలుకి బ్రతుకు బరువైపోయింది." తండ్రీ, ప్రేమికుడూ--ఇద్దరు పురుషుల పంతాలకూ మధ్య నలిగిపోయింది.

"అలివేలు కదిలింది. వెలవెలుగులో పచ్చని చీరలో నించీ, మసకగా మెరిసాయి మెళ్లో మంగళసూత్రాలు - కన్నీళ్లు చిమ్మిన కనుదోయిలా" అని కథ ముగిస్తుంది రచయిత్రి.

తండ్రిని ఎదిరించలేని ఆడపిల్లల నిస్సహాయ పరిస్థితి, నిర్బంధ వైవాహిక జీవితం - ఇది ఈ నాటికీ జరుగుతున్న చరిత్ర.

○

## నాకు నచ్చిన కథ

# చిరు చెమటలు, చందనం

- కల్యాణ సుందరీ జగన్నాథ్

అంతరిక్షం దీపాలు వెలిగించుకుంది. ఆ నక్షత్రాల వెలుగులో లోగిలి వెనక మండువాలో, నుంచుంది అలివేలు--పూసిన తంగేడులా.

కనుమొఱుగుగా దేవుడి గుళ్ళోకి వెళ్లాలి. ఒంటరిగా రాత్రి బయలుదేరడం ఇదివరకు అలవాటు లేదు. కాని, ఆ విషయం తనకి గుర్తయినా రాలేదు

ఇల్లంతా పెళ్ళి సందడితో నిండి ఉన్నది--చుట్టాలతో పక్కాలతో కిసకిస లాడుతూ. పచ్చితాటాకుపందిళ్ళూ, మామిడాకు తోరణాలు, పసుపు కుంకాలూ, మల్లి పూలూ, గంధం, ఐరేని కుండలసొంపు, పిల్లలపరుగులు, పెద్దల చిరునవ్వులు, వరసలైనవాళ్ళ సరసాలు--పెళ్ళినిండుతనమంతా పందిరి పలవరిస్తోంది.


ఆ పగలంతా కన్నీరు మున్నీరుగా ఏడ్చింది ఆలివేలు.

అందరూ ముందర పందిట్లోనే ఉన్నారు. ఊపిరాడకుండా ఉడికి పోతూంది ఉక్క--ఆ పగటి వర్షానికి. అకాలపువాన పెద్ద జల్లు విసిరిందట. పెండ్లికి వేసిన ప్రహరీ బచ్చళ్ళ అడుగులు తుడుచుకు పోయినాయి. తనని ఎత్తుకుపెంచిన నాగమ్మ ముఖం చీకటి క్రమ్మింది. "ఆఁ! ఏమీ లేదు. మణ్యపు తొలకరి. ఇక్కడా ఒక ఇసురు ఇసిరింది,' 'అంది పైకి, లోపల గుండె బరువెక్కింది నాగమ్మకి--అంటారుగా తప్పని--పెళ్ళి బచ్చళ్ళు కరగకూడదని. "గంగి గోలాటిదమ్మా బిడ్డ, బెమ్మ ఎట్టా రాసిపెట్టాడో!" అని గొణుక్కుంది తనలో తాను.

సత్యమూ, తనూ కలిసి పెరిగారు. వాళ్ళని కాడి గట్టు పొలాలు. సత్యం చెల్లెలు జానకి తప్ప ఆలివేలుకి ఇంకోజత కత్తె లేదు. ఒకే ఊరుగనుక వరస లెట్టుకుని పిల్చుకునే వారు.

కంచంలో పాలుపోసి అంచున వెన్నపెట్టి పెంచింది సత్యాన్ని వాళ్ళమ్మ. కడసారపు కొడుకు. అతనాడింది ఆట. పాడింది పాట.

బడిపంతులుగా రొకసారి పలకమీద 12 అంకె వెయ్యమంటే 11 అంకెవేసి 12 అన్నాడు సత్యం. త్రికరణ శుద్ధిగా నమ్మి, కాదని పంతులుగారు కొట్టారు. సత్యానికి కోపం వచ్చింది--తన్ని కొట్టడమూ అనిపించింది. తన ప్రక్కనే పలకపట్టుకుని నించున్న పంతులుగారి పెద్దబ్బాయి. తన



చెవిలో ఎంతో గునగున చెప్పాడు. అంకెతప్పని. సత్యం నమ్మలేదు. ఏంచేతనో ప్రాణంపోయినా సరే. అతని నమ్మకం వదలలేదు, సత్యం. ఇంకా నాలుగు దెబ్బలు తిని చదువు చాలించాడు.

ఇహను, బుద్ధి తెలిసిన తరువాత తనంతట తాను వృద్ధి చేసుకున్న చదువే.

చిన్నప్పుడు, పైన కాన్త మబ్బుపట్టంగానే, జానకీ, అలివేలూ "వానొచ్చే పెద్దమ్మా! వడ్లు తియ్యి పెద్దమ్మా!" అని పాడుకుంటూ చేతులు చాపుకుంటూ. ఒకళ్ళచేతు లొకళ్లు పట్టుకుని గుండ్రంగా గిరగిర వాకిలంతా తిరిగి ఆడేవాళ్ళు--కట్టుకున్న పరికిణీలూ, వేసుకున్న కుచ్చుజడలూ కూడా గిర్రున తిరుగుతూ, వీళ్ళని గసురుతూ ఎండబెట్టినవడ్లు, వీళ్ళ కాళ్ళల్లోనించీ, గబగబా నాగమ్మ తుడుచుకుపోయేది.

ఒకనాడు జానకి చేతులో ముల్లు విరిగింది. పచ్చని చెట్టుకేసి చూస్తాండమని. అలివేలు ఎంతో సుతారంగా ఆ ముల్లుకుట్టి తీసి వేసింది. కాని, తీసేటపుడు జానకికి చురుక్కుమంది "రాకాసి వదిన!" అంది నవ్వుతూ. ప్రక్కనే

**అలివేలు గుండె గబ గబ కొట్టుకుంది. తటపటాయించుకుంది. కళ్లు మూసుకో బుద్ధి వేసింది. సత్యం కాళ్లమీదపడి దేముడికి దణ్ణం పెట్టుకుందా మనిపించింది. కాని, ఎందుకో చేతులూ కాళ్ళూ ఆడలేదు.**

నిలబడి ఉన్న సత్యం, అలివేలు ముఖంలోకి చూస్తూ చిరునవ్వు నవ్వాడు. అలివేలుకు మహా ఉడుక్కుపోయింది.

రామిలేరు శిలమండలు మునగడు. కాని ఎంత విసురు. పావడాల కుచ్చులన్నీ





చేత పట్టుకుని ఆడపిల్లలంతా కష్టపడి దాటుతున్నారు. పాదాల క్రిందనించీ ఇసక కొట్టుకుపోతూంది. పాదాలు తేలిపోతూన్నాయి. సత్యం జానకిని చేతులమీద ఎత్తి ఒడ్డు చేర్చాడు. తిరిగి వచ్చి అలివేలుని ఎత్తుకున్నాడు. కాని అవతల ఒడ్డు చేరగానే చటుక్కున కిందికి వదిలేసాడు, అలివేలుని. వెంటనే చరచరా నడుచుకుంటూ ముందరికి సాగాడు తన కుడిచేతినీ, జుట్టూ సరిగా సర్దుకుంటూ, అలివేలుకేసి చూడనైనా చూడకుండా. అలివేలు కి భయం, కష్టం కూడా కలిగింది.


ఆ సాయంత్రం ముగ్గురూ ఆలస్యంగా ఇళ్లు చేరారు. అలివేలు బామ్మ "ఏంవే ఇంత ఆలస్యం? ఎక్కడికెళ్ళావు?" అంది. "నేనూ జానకీ రామిలేరు గట్టుమీదికి జామపళ్ళకెళ్ళాం" అంది అలివేలు. "ఓసీ, నీ ఆగడం చల్లగుండ! ఇద్ద రాడపిల్లలు ఒంటరిగా అంత దూరం వెళ్తారా? అదుపులేని గుర్రాలు అగడ్తలు దాటినయ్యని!" అంది బామ్మ. ఇద్దరం కాదు సత్యం కూడా ఉన్నాడు అనబోయింది, అలివేలు. కాని నోరు రాలేదు, ఎంచేతనో.


సంవత్సరాలు గడుస్తున్నాయి.


ఒకనాడు అలివేలు తండ్రి రమణయ్యగారు ఇంటికొచ్చి "ఈ సత్యంగాడి బుద్ధులు వెర్రితల లేస్తునాయంటే! ఈయాళ, నురిపిడిలో, ఒక ఎద్దు కంకులు మేస్తావుంటే, దాని ముట్టెమీదేమో ఒకటే సాడంట, మన చింతాలు. ఆ మట్న సరసరా కడియంలో జొరబడి ఆ సత్యంగాడు, చింతాలుని రెండు లెంపకాయ లేశాడంట. పైగా, 'నోరులేని జీవాల్ని నోటిమీదేస్తావట్రా?--వాటి కష్టమంతా తింటాను, అడ్డగాడిదలాగ. అది తింటే ఏంరా అడ్డెడొడ్లు, అది కష్టపడేటపుడు? ఉన్నగింజలు చాలవూ మీకు?', అని ఇంకేవేవో పిచ్చికూతలు కూశాడంట. వాడి కెందుకంట?" అంటూ విసుక్కున్నారు. రమణయ్యగారికి సత్యం పొడగిట్టడంలేదు ఆనాట్నించీ

4-A




ఊరుమధ్య దిబ్బమీద జువ్విచెట్టు ప్రక్కన పండగకి కట్టిన పెద్ద తాటిబద్దల ఉయ్యాల, అందరూ ఊగుతూంటే ఒకనాడు అలివేలూ జానకీ అక్కడికి తయారయ్యారు. అలివేలు భయస్థురాలని, తనని ఏడిపించాలని కావాలని గట్టిగా ఊపారు మిగతాపిల్లలు. అలివేలుకి కళ్లు తిరిగాయి. ఏడ్చి మొత్తుకుని దిగిపోయి, జానకి భుజంమీద ఒరిగి కళ్లు గట్టిగా మూసుకుంది. చెఱువులో ఎడ్లకి నీళ్లు పెడుతూ సత్యం చూశాడు. ఎడ్లని వదిలేసి చరాచరా ఉయ్యాల దగ్గరికి వచ్చాడు. దూరంగా ఉండగానే "అమ్మాయ్, జానకీ ఏమిటీ చిలిపిచేష్టలు. వదండి ఇంటికి ముందర. అంత విసురుగానా ఊగడం?" అన్నాడు గాబరాగా, కోపంగానూ.

అలివేలుని బలవంతంగా చేతులుపెట్టి లాగుతున్నవాళ్ల చేతులు వదిలేశారు. "పదపోదాం!" అంది జానకి నిమ్మళంగా. జానకి భుజంమీద చెయ్యి తియ్యకుండానే కాళ్ళీడుస్తూ పోతున్న అలివేలు వెనక్కి తిరిగి చూసింది. తిరిగి ఎడ్లదగ్గరికి వెళకున్న సత్యం అల్లాగే ఆగి అలివేలుకేసే చూస్తున్నాడు. అలివేలు హృదయం నిండిపోయినట్లయింది. సత్యం ఆవ్యక్త ప్రేమని ఇంగితంలేని తనూగ్రహించుకో గలిగింది.

ఆ రోజంతా సత్యం కళ్ళల్లో మెదిలాడు అలివేలుకి.

"వీడి కొంద్రెంత? వీడి బ్రతుకెంత? ఆ ఏయ్: మరి రెండ రకలుంటే, వీణ్ణి పట్ట పగ్గా లుండేవిగాదు సుమా!" అంటూ, ఇంట్లోకి వచ్చాడు, ఒకనాడు రమణయ్యగారు.

మరొకనాడు "బోదు లూడ్చుకొ మన్నాడండ, మళ్ళీ పాలే రాణ్ణి - వాడే ఆసత్యం. ఇక నిల్లా చేస్తే, మన చింతాలు గాడు, ఇక మనలాంటి వాళ్ళని రెండు మళ్ళే ఊడ్చుకో నివ్వ మంటాడు, కాడి గట్టునే ఇట్టా జరుగుతూంటే".

"అదేం?" అంది భార్య పనిచేసుకుంటూ.

"ఏటి గట్టు మీద నేరేడుపండ్లు ఏరు కొద్దాం," అంది జానకి, చద్దన్నా లయ్యాక, ఒకసారి. చేలోకి వెళుతూ, సత్యం, చెట్టు వద్దాగాడు. పెద్దపెద్ద పండ్లున్న కొమ్మఎక్కి దులిపాడు. జానకి ఏరుతూంది

"మీ బాబు నీకు సంబంధం వెతుకుతున్నాడంటగా?" అన్నాడు సత్యం. కొంచెం దూరంగా చతికిల పడుతూ.

అలివేలు కాళ్ళు చాపుకు కూచుంది, జానకి చిన్నముగా వాళ్ళనందరిని బెదిరించి, పెద్ద పెద్ద పండ్లు ఏరుకుంటోంది.

"ఏం, మాట్లాడ వేం?" అన్నాడు. నిశ్శబ్దం.

"మాతో చెప్ప కూడదా?" తిరిగి.

అలివేలు, తల వంచుకొని, నేలమీద ప్రాకుతూన్న గండు చీమని పరీక్షిస్తూంది.

"కలిగిన వాళ్ళ కోసం వెతుకుతున్నా డంటగా - మీ అయ్య? నిజమేనా?"

"ఉన్న ఆస్తి చాలదూ, మీకు?" కొంచెం ఆగి.

"మరి మీ బాబమ్మ ఏమంటూ ఉంది?"

"నీకేమన్నా మూగినోమూ గట్రా ఉందా ఏం? మాట్లాడవూ? ఇదిగో ఇటు ఒకసారి చూడు."

నీళ్ళు క్రమ్మిన కళ్ళు పైకి చూశాయి.

"నాకు తెలవదు." అంది నిమ్మళంగా.

వెంటనే "అయ్యెయ్యో !" అని తన కాలి బొటనవ్రేలు పట్టుకుంది, చేతితో--గబుక్కున కాళ్ళు దగ్గరగా లాక్కుని. "ఏం?. ఏం?" అన్నాడు. గాభరాగా సత్యం. "చీమ" అంది. "ఇది గండు చీమ. ఇది కుడితే. తేలుకుట్టినంత బాధ," అంటూ అక్కడే పడి ఉన్న పచ్చి రొబ్బతో నలిపేసాడు. ఆ చీమని. చీమ రెండు తుణ్ణాలయ్యి తన్ను కుంటోంది.

"చంపెయ్యి! చంపెయ్యి!" గాభరాగా అరిచింది అలివేలు.

"బయ్యమే?" అన్నాడు, చిరునవ్వుతో సత్యం. తిరిగి ఒక దెబ్బతో ఛటుక్కున ఆ చీమని చంపేసి.

"కొన ఊపిరితో ఉంచకూడదంటగా. పావం! ఏ మాత్రం ఊపిరున్నా ఎల్లి దేముడుతో చెబుతయ్యంట," అంది.

"పిచ్చిపిల్ల! సుతి మెత్తని గుండె నీది,' అన్నాడు సత్యం. తృప్తిగా.

"ఏమయిందేం?" అంటూ, వళ్ళో పళ్ళు మోసుకొని గభగభా వచ్చింది, జానకి.


ఆరోజంతా, అలివేలుకి మతి మతిలో లేదు. ఒక వేపు ఏడు పొస్తోంది. మరొక వేపు సంతోషం ఉబికి వస్తోంది.

కాలం గడుస్తోంది.

ఒకసారి హడా విడిగా సత్యం వస్తూ. "ఇదిగోచూడు, మన జమిందారు గారు రంగారావుగారూ నేనూ స్నేహమయ్యాం. మొన్న దూడకి కాస్త లేత పరకలు కోసు కొద్దామని పొలంగట్టుమీది కెళ్ళా. గట్టు మూలని రోడ్డుమీద రంగారావుగారు నిలబడి ఉన్నారు. "కారాగి పోయింది. కాస్త తోద్దాంరా. తమ్ముడూ" అన్నారు. వారా వీరా అని కేక పెట్టి నలుగురిని పోగుచేసి, మేడదాకా తోశాం. నన్ను లోనకి రమ్మన్నారు. ఎళ్ళా. శానాసేపు కూచోపెట్టి నాతో మాట్లాడారు. అస లు నేను కాంగ్రెసు వాణ్ణి అయిపోదామని ఉంది, అన్నాడు.

"అంత ఉద్యోగం నీ కెట్లా వస్తాది? అంత చదువులు చదవాలగదా!" అంది. అలివేలు విచారంగా.

"ఓసీ వెర్రి పిల్లా! అది ఉద్యోగం కాదు. అది ఒక సేవ. దేశం కోసం. అదేనంట మన గాంధీగారు చేప్పేది. అబ్బో! ఏం. ఏం సంగతులు చెప్పారూ. రంగనాధంగారు! ఏంకద! అప్పుడప్పుడు వస్తా ఉండ మన్నారు కూడాను. వారి




చెల్లెలు రామబాయమ్మగారు పట్టణంనించీ పెద్ద చదువులు చదివి ఒచ్చిందిగా! ఏం స్వతంత్రం! ఏం స్వతంత్రం! ఎదురుంగా వచ్చి పలకరిచ్చి పేరడిగింది. అసలు నేను చేతిలో ఉన్న దూడ గడ్డి వాళ్ళ కుర్చీలో పెట్టి మర్చిపోయి వచ్చేశాను. రెండుమెట్లు దిగానో లేదో ఆపలంగా ఆమె గుమ్మంలోకి ఒచ్చి పేరు పెట్టిపిలిచి, చిరునవ్వుతో ఆ గడ్డి కట్ట నా చేతి కందించిందంటె! ఎంత చక్కటి చీర కట్టిందనుకున్నావు?" అన్నాడు ఏకధాటిగా.

తిప్పుకుని ఉన్న అలివేలు ముఖంలో కాంతి ఒక చెన్ను దరిగింది.

"నువ్వూ అట్లా ముస్తాబయితే చూడాలని ఉంది" అన్నాడు సత్యం. ఆప్యాయంగా. అలివేలు మనస్సు లోలోపల ఉప్పొంగి పోయింది.

ఇంట్లో అలివేలుకి సంబంధం చూస్తున్నారు.

ఒకనాడు. ఆకు మళ్ళ రోజులో కోడిగట్లమీద కాళ్ళ గోరింటాకు కడుక్కుంటున్నారు అలివేలూ, జానకీ. పొలంలో చూసి వచ్చాడు సత్యం. "మీ అయ్య గుణం నాకు నచ్చలేదు. కుమ్మరి ఆవంలో ఇత్తడికుండ పుట్టినట్టూ నివ్వు పుట్టుకొచ్చావు ఆ పుణ్య శాలికి;---అంతే గాని.....అతనికి డబ్బే దేవుడు. ఏమైనా సరే అతనిని నేనుగాని నావాళ్ళుగాని వెళ్ళి బ్రతిమాలతారన్న మాట బ్రహ్మకల." అన్నాడు. కొంచెమాగి "తీరామేమడిగాక లేదూ కూడదని అతనంటే---నేనసలు ఉగ్గ బట్టలేని మనిషిని. శ్రుతిమించు కొస్తుంది.' ' అన్నాడు, సాచుకుని ఉన్న తుమ్మ మొదుమీద జారిగల బడుతూ.

అలివేలు కళ్ళప్పగించి చూసస్తా ఊరుకుంది. నోటమాట రాలేదు. "ఇక నేమిగతి దేముడా" అనిపించింది మనస్సులో.

సత్యం, కొంచెం సేపాగి తదేక దృష్టితో "నాకేం చెయ్యాలో పాలు పోటంలేదు పిల్లా," అన్నాడు......"సన్యసి చ్చి. ఎటైనా బడి పోదామని పిస్తోవుంది ఒక్కొక్కసారి,. వెర్రి ఎక్కినట్లయిపోతాది"

అలివేలు గుండె గబ గబ కొట్టుకుంది. తలవంచుకుంది. కళ్ళు మూసుకో బుద్ధి వేసింది. సత్యం కాళ్ళమీదపడి దేముడికి దణ్ణం పెట్టుకుందా మనిపించింది. కాని, ఎందుకో చేతులూ కాళ్ళూ ఆడ లేదు.

"అన్నుదేవత లుంటారంట బావా! అట్టా అనబోకు," అంది కాస్సేపాగి ధైర్యం చిక్కబెట్టుకుని.

కార్తె వెళ్ళి కార్తె వస్తోంది.

"మీవాళ్ళతో నువ్వు చెప్పు మా అయ్యాని అడగమని," అంది. అలివేలు ఒకనాడు నిమ్మళంగా. సీమ చింతపళ్లు కోస్తూ.

"ఛస్తే! మీ బాబునే! నేనే" అన్నాడు

సత్యం అలివేలుకి అందని కొమ్మ అందిస్తూ. అందుకోకుండా కొమ్మ వదిలేసింది. కళ్ళు నీళ్ళు నిండాయి. పిలువ వచ్చిన పాలేరుతో కలసి సత్యం వెళ్ళిపోయాడు. ఇంతలేసి పళ్ళుండంగా, ఈ లేత పిందెలు కోసేవేమే?" అని గసిరింది జానకి వచ్చి.

సత్యం మనన్సు కరిగించమని మొక్కు కొనేది; అలివేలు. మండు టెండల్లో లేగని వెతుక్కుని రాబోయి. ఎండ దెబ్బ తిన్నాడు సత్యం. జ్వరం వచ్చింది.

అలివేలుకి దూరపు వేలు విడిచిన మేనరికం. సంబంధం చూచారు. అవతలవాళ్ళ డబ్బునిబట్టి, తండ్రి వెనకా ముందూ ఆలోచించలేదు.

అలివేలుకి బ్రతుకు బరువైపోయింది. ఒకనాడు, తల్లిపాలు చాలక పాలిచ్చిపెంచిన నాగమ్మ వళ్ళోబడి బావురుమని ఏడ్చింది. "మనందరిదీ ఆడబ్రతుకేనే అమ్మా పుట్టిల్లూ, మమ్మల్నందరినీ, విడిచిపోవలసిందే!" అని నాగమ్మ ఓదార్చింది. కాని, ఎండకి ఎండి వానకి తడిసిన నాగమ్మకి పిల్లకి లోపల ఏదో చాలా బాధ ఉన్నట్టూ తోచింది.

ఒక కనిచీకటివేళ జ్వరంతోనే సత్యం జువ్విచెట్టుక్రింద నిలబడ్డాడు. ఎన్నడులేని ధైర్యంతో అలివేలు వచ్చి ఎదురుగా నించుని, ముఖం త్రిప్పుకుని శబ్దంలేకుండా ఏడ్చింది. "రేపే జమిందారుగారితో మాట్లాడి మీ బాబుకి చెప్పిస్తాను. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు, ఈ పెళ్ళి జరగనివ్వనులే. బయపడకు" అన్నాడు.

ఎక్కడో అడుగుల చప్పుడైంది.

"నేను నిలబడలేను. నువ్వు ముందర లోపలికి పద," అన్నాడు.

నిర్జీవ ప్రతిమలాగు, అలివేలు తన, గదిలోకి వెళ్ళిపోయింది. సత్యం తరువాత నిమ్మళంగా కదిలాడు.

సత్యానికి జ్వరం ఎక్కువైంది. సీతమ్మగారికి మతిపోయింది. గ్రామ భూతవైద్యుడు పేరంటాలయ్యగారు, బ్రతకడం కష్టం అన్నారు.

ఒకనాడు నాగ, "సీతమ్మగారి కనిష్టుడి మాట నమ్మకం లేదంటమ్మా. గుణంకూడా పుట్టుకొచ్చిందంట!" అంది. "అదేం మాటే. పిచ్చిదానా. పెళ్ళిపందిట్లో?" అంది అవ్వగారు ఉట్టిమీద నెయ్యి దించుతూ.

"పాపం. సీతమ్మ గ్రహచ్చారం!"

ఆ మాటలు చెవిన బడంగానే అలివేలుకి కళ్ళు చీకట్లు క్రమ్మినాయి.

యజ్ఞపశువులాగు పెళ్లి సరంజాలన్నీ అనుభవిస్తోంది.

వారం రోజులు వరసగా కనబడకపోయేటప్పటికి ఆచూకీ తీసి రంగారావుగారు స్వయంగా వచ్చి చూశారు. సత్యాన్ని. మంచంమీద.

ఇవ్వేవీ మతిలో తోచలేదు, అలివేలుకి, ఆ సందెవేళ. మనస్సంతా ఒక్కటే ప్రార్థన.

ఈ అనంత విశ్వంలో సూర్యమండలంలో గ్రహల్లా, పరమాణువులో రేణువుల్లా సూచనప్రాయంగా స్వామి చుట్టూ ప్రదక్షిణం చెయ్యమన్నారు పెద్దలు. అలివేలు గుడిచుట్టూ తిరిగివచ్చి దేవుడికి దణ్ణం పెట్టింది. ఏడ్చింది. సత్యం బ్రతకాలి.

ఆరాత్రి, "చూశావా నాగా, ఈయనగారి పని! ఇంకా కాసిని వడ్లు మరపట్టించినట్టయితే ఏం అంటా? రేపు సువ్వారాలకి బియ్యం చాలవు. ఈయన గారి పనులన్నీ ఇంతేలే?" అంది అలివేలు తల్లి----విసుగ్గా.

"ఏం బయ్యం లేదులే. నే నందిస్తాగా,' అరిచింది నాగ.

రెండు తూముల వడ్లు గరిశెలోనించీ తోడి వెనక వాకిట్లో గుంటలో పోసింది. చింతాలూ అతని మరదళ్ళిద్దరూ పోటు వేస్తున్నారు, వెన్నెలలో. "నాగప్ప పదం పాడాలి. లేకుంటే నిద్ర ఒస్తాది" అన్నారు ఆడపిల్లలు.

"ఆఁ! నా పిచ్చపదాలకేంగాని, ఎయ్యండి పిల్లా!" అంది నాగతనూ పోటు కలుపుతూనూ. "లోనంతా ఏదో దిగులుగా ఉంది. కులాసాగా లేదు పిల్లా"

కిటికీలో, గువ్వలాగు కాళ్ళు దగ్గరగాపెట్టుకుని కూచుంది, అలివేలు, తన వెనక్క తలుపుకు ఆనించి.

సత్యం పాలేరు, రాత్రి నిద్రకాస్తూ చింతాలువద్దకి పుగాకుకి వచ్చాడు. "మీ కామందు ఎట్టా వుండారు?" అడిగాడు చింతాలు.

"రాత్రి సందెకాడ బస్తీనించీ పెద్ద డాక్టరుని తీసుకొచ్చాడుగా జమిందారు గారు, నీకు తెలవదూ? అదేం మందో, జీవదారపుల్లల్లే పనిచేసిందంటె? ఇక బతుకుతాడంటలే.

"పోనీలే మారాజు మా మంచోడు. మా లావు స్నేహాలు చేసాడులే," అన్నాడు చింతాలు పుగాకు తునక చేతికిస్తూ.

పోతిరాజు స్వరంవినబడగానే చెవులు విప్పుకుని విన్నది, అలివేలు. తల పైకెత్తి అదృశ్యదేవతలకి చేతులు జోడించింది.

తనకి తిరిగి మతివచ్చేటప్పటికి నాగమ్మ పిచ్చిపాట వినోచ్చింది.

"వేసవ్వికాలాన పూసేను బూరగలూ ఆశతో ఆ చిలకలూ ఆరు నెలలుండే" ఎయ్యండమ్మా పోటు. ఎయ్యండీ, ఊం! మరొక పాలి ఎగతొయ్యండి.

"పువ్వు పూసేవరకు పుడికొమ్మనుండె కాయ కాసేవరకు కడకొమ్మనుండె. పండు పండే వరకు పలవల్లి ఉండె. తినబోతే దూదాయె! తీసి లేదాయె! మళ్ళండి చిలకల్లార మన మన్యభూములకు"

అలివేలు కదిలింది. నెలవెలుగులో పచ్చని చీరలోనించీ, మసకగా మెరిసాయి మెళ్ళో మంగళసూత్రాలు---కన్నీళ్లు చిమ్మిన కనుదోయిలా.

●

అలివేలుకి బ్రతుకు బరువైపోయింది. ఒకనాడు, తల్లిపాలు చాలక పాలిచ్చి పెంచిన నాగమ్మ వళ్ళోబడి బావురుమని ఏడ్చింది. "మనందరిదీ ఆడబ్రతుకేనే అమ్మా, పుట్టిల్లూ మమ్మల్నందరినీ, విడిచి పోవలసిందే!" అని నాగమ్మ ఓదార్చింది. కాని, ఎండకి ఎండి వానకి తడిసిన నాగమ్మకి పిల్లకి లోపల ఏదో చాలా బాధ ఉన్నట్టూ తోచింది.